క్లుప్తంగా

కళాకారులకు పురస్కారాల ప్రదానం



నయీంనగర్: తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ మాచవరం గౌరిశంకర్ ఆధ్వర్యంలో హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో కళాకారులకు జాతీయ పురస్కారాలను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అందజేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈఓల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అద్దంకి నాగేశ్వర్ రావు, మహిపాల్, గర్రెపల్లి నవీన్ కుమార్, కరుణాకర్ గుప్తా, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లయ్యకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని సోషియాలజీ విభాగం పరిశోధకుడు, ఖిలా వరంగల్ తిమ్మాపురం గ్రామానికి చెందిన మధుపాక ఎల్లయ్యకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. గౌతమ బుద్ధాస్ టీచింగ్స్ అండ్ ఇట్స్ రెలవెన్స్ టూది కాంటెంపరరీ ఇండియన్ సొసైటీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఎల్లయ్యకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ రామానుజరావు పర్యవేక్షణలో ఎల్లయ్య తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

ఆగస్టు 26, 27, 28వ తేదీల్లో విగ్రహాల పునఃప్రతిష్ఠాపన

ఖిలా వరంగల్: ఆగస్టు 26, 27, 28వ తేదీల్లో వరంగల్ ఫోర్ట్‌రోడ్డు పెట్రోల్‌బంక్ జంక్షన్‌లోని శివశక్తి వినాయక మందిరంలో శివలింగం, వినాయక, నందీశ్వర, విగ్రహాల పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాలను వైభవంగా నిర్వహించనున్నట్లు మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్ యాదవ్ తెలిపారు. ఈమేరకు నల్లకుంట రవికుమార్, దేవేందర్ అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో విగ్రహాల పునఃప్రతిష్ఠాపనను ఆగస్టులో శాస్త్రీయంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. విగ్రహాల దాతలు సిద్ధం రాము, కార్పొరేటర్ ఉమ, గజ్జెల శ్యామ్, నల్లకుంట రవికుమార్, డాక్టర్ రమేష్, కమ్మ రామ్మోహన్‌రావు విరాళంగా రూ.25 వేల చొప్పున ఇచ్చేందుకు ముందుకొచ్చారు.

బిర్యానీ విక్రయ కేంద్రాలపై బాధితుల ఫిర్యాదు

కాజీపేట: కాజీపేట పట్టణంలో నాసిరకం నూనెలు, కుళ్లిన మాంసంతో తయారు చేస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్న బిర్యానీ పాయింట్లపై ఆకస్మిక దాడులు చేయాలని బాధితులు కోరారు. ఈమేరకు కోరుతూ మున్సిపల్ అధికారులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. పట్టణంలో లెక్కకు మించిన బిర్యాని సెంటర్లను ఏర్పాటు చేసి ధర తక్కువ పేరుతో ఆకర్షిస్తూ ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల కాజీపేట చౌరస్తాకు సమీపంలో బిర్యాని తిన్న 8మందికి వాంతులు, విరోచనలు అయిన విషయాన్ని గుర్తుచేశారు. రాత్రి మిగిలిన బిర్యానిని దాచిపెట్టి ఉదయం వేడి చేసి విక్రయిస్తున్న వ్యాపారుల ఆట కట్టించాలని బాధితులు కోరారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి


శివకుమార్ (ఫైల్)

కాజీపేట: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి దాదాపు రెండు వారాల పాటు మృత్యువుతో పోరాడిన ఓ యువకుడు ఎంజీఎం ఆస్పత్రిలో ఆదివారం తుదిశ్వాస విడిచాడు. కాజీపేట సీఐ సుధాకర్ రెడ్డి కథనం ప్రకారం ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన రొండి శివకుమార్ (24) ఈనెల 3వ తేదీ రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడి రహదారిపై పడిఉన్న శివకుమార్‌ను 108 అంబులెన్స్ సర్వీసులో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పక్షం రోజులుగా చికిత్స పొందుతున్న శివకుమార్ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడి తండ్రి సంపత్ ఫిర్యాదు మేరకు ఎస్సై లవన్ కుమార్ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ఘనంగా ఫాదర్స్ డే



హసన్‌పర్తి: ఫాదర్స్ డే వేడుకలను హసన్‌పర్తి మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారులు, కూతుళ్లు తమ తండ్రికి పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ తన ఇంటిలో ఆదివారం రాత్రి ఫాదర్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అరూరి రమేష్ కేక్ కట్ చేశారు.

ఇందిరమ్మ కాలనీలో సమస్యలు

- కనీస సౌకర్యాలు కరువు
- వర్షాలకు నీట మునుగుతున్న కాలనీ
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


ఇందిరమ్మ కాలనీ వ్యూ


చెరువులో మట్టి తవ్వకాలతో ఏర్పడిన గొయ్యి


గతేడాది కురిసిన వర్షాలకు చెరువును తలపిస్తున్న ఇందిరమ్మ కాలనీ

హన్మకొండ అర్బన్: హనుమకొండ 49వ డివిజన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ (జర్నలిస్టుల కాలనీ) సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోంది. 15 ఏళ్లుగా కాలనీవాసులు అనేక అవస్థలు పడుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. వర్షాలకు వరదతో కాలనీ మొత్తం నీట మునుగుతోంది. రోడ్లు, డ్రెయినేజీలు లేక ప్రజలు అనేక అవస్థలు పడుతూ బతుకీడుస్తున్నారు.

విన్నవించినా పట్టింపు కరువు

2008వ సంవత్సరంలో బీపీఎల్ కేటగిరీలో వందలాది మందికి అధికారులు రైల్వే ట్రాక్ అవతల ఇళ్ల స్థలాలు కేటాయించారు. చాలామంది ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నారు. వారికి సౌకర్యాలు కల్పించే విషయంలో అధికారుల నిర్లక్ష్యంగా వహిస్తున్నారని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. సదుపాయాలు కల్పించాలని పలుమార్లు కలెక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ఎవరూ తమను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. చెరువు సమీపంలోనే ఇందిరమ్మ కాలనీ ఉండడంతో భారీ వర్షాలు కురిస్తే వరద నీటితో కాలనీ మునిగిపోతోంది. కనీసం ఇంట్లో ఉండడానికి కూడా అవకాశం ఉండని దుస్థితి నెలకొంటోంది. గత అనుభవాలే అందుకు సజీవ సాక్ష్యం. గతేడాది వర్షాకాలంలో ఈ కాలనీ నీట మునిగితే బాధితులను జేసీబీలు, ట్రాక్టర్ల సహాయంతో సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలించారు. అప్పుడు రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తామని ఇచ్చిన హామీని ఇప్పటివరకు నెరవేర్చలేదని ప్రజలు చెబుతున్నారు. వానాకాలంలో మట్టి రోడ్లు బురదమయంగా తయారవుతున్నాయని తెలిపారు. డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే పారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



డివిజన్‌లో నెలకొన్న ఇందిరమ్మ కాలనీ సమస్యలను ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి వివరించాను. సమస్యల పరిష్కారానికి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం. త్వరలోనే డివిజన్‌లో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. త్వరలో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి శాయశక్తులా కృషి చేస్తా.

– ఏనుగుల మానస, కార్పొరేటర్

మట్టి తవ్వకాలతో ఇబ్బందులు

ఇందిరమ్మ కాలనీ పక్కనే ఉన్న చెరువు నుంచి మట్టి వ్యాపారం అక్రమంగా లారీల్లో తరలిస్తుండడంతో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఇదేంటని అడిగిన కాలనీవాసులపై మట్టి వ్యాపారులు దాడులకు తెగబడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు ఘర్షణలు జరిగాయి. నల్లమట్టిని అక్రమంగా తరలిస్తున్న క్రమంలో చెరువులో గోతులు ఏర్పడడంతో వాటిలో నీరు చేరి దోమలు వృద్ధి చెందుతున్నారు. ఈక్రమంలో కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నారు. వర్షాకాలంలో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుంది.

బక్రీద్ పర్వదినం.. త్యాగానికి ప్రతీక

- నేడు ఈద్ – ఉల్ – జుహా వేడుకలు
- ఈద్గాల్లో ప్రత్యేక నమాజ్


ఖిలా వరంగల్‌లోని ఈద్గా ప్రాంగణం

హసన్‌పర్తి/ ఖిలా వరంగల్/ హన్మకొండ కల్చరల్: బక్రీద్.. త్యాగానికి ప్రతీక. దైవాజ్ఞ మేరకు తన కుమారుడిని బలి ఇవ్వడానికి సిద్ధమైన తండ్రి భక్తికి ప్రసన్నుడైన దైవం అతడి (కుమారుడి) స్థానంలో ఒక దుంప(మేక పోతు) ప్రత్యక్షమవుతుంది. ఆ రోజు జ్ఞాపకార్థం ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ (ఈదుల్ జుహా)వేడుకలు జరుపుకుంటున్నారు. పూర్వీకుల కథనం ప్రకారం.. మహ్మద్ ఇబ్రహీం.. దేవుడి(అల్లా) ప్రియమైన భక్తుడు. మహ్మద్ ఇబ్రహీం భక్తిని పరిశీలించడానికి అల్లా అనేక పరీక్షలు పెట్టాడు. ఓ రోజు దైవం కలలోకి వచ్చి నీ కుమారుడు ఇస్మాయిల్‌ను అల్లాకు బలి ఇవ్వాలని ఆజ్ఞాపించాడు. అప్పుడు ఇబ్రహీం వెనుకాడకుండా, ఆలోచించకుండా భార్య, కుమారులను తీసుకుని ఓ నిర్జీవ ప్రదేశానికి బయలుదేరాడు.. అయితే మార్గ మధ్యలో భార్య ఎక్కడి తీసుకెళ్తున్నారని ప్రశ్నించగా... ఇది దైవాజ్ఞ అని చెప్పడంతో ఆమె నోరు మెదపదూ. ఇబ్రహీం వెళ్తుండగా సైతాన్ ఆయనను వెంబడిస్తూ.. నీవు చేయబోతున్న పని మంచిది కాదు... కలలో వచ్చి కొడుకును బలి ఇవ్వమంటే ఇస్తావా..ఇది న్యాయం కాదు.. నీవు చేయబోతుందని పొరపాటని ఇబ్రహీంను సైతాన్ పక్కదారి పట్టించే ప్రయత్నాలు సాగించాడు. అయినా ఇబ్రహీం ఆయన మాటలను లెక్కచేయకుండా దైవకార్యంలో లీనమై ముందుకు సాగాడు. నిర్జీవ ప్రదేశానికి వెళ్లిన తర్వాత గొంతుపై కత్తి ఎక్కిపెట్టడానికి తండ్రి సహసించడని భావించిన ఇస్మాయిల్.. కళ్లకు గంతలు కట్టుకుని దైవమార్గంలో బలి ఇవ్వమని తండ్రిని కోరాడు. కుమారుడు చెప్పిన విధంగా ఇబ్రహీం కత్తితో కుమారుడి గొంతుపై ఎక్కిపెట్టే క్రమంలోనే ఇస్మాయిల్ స్థానంతో దుంబ(పొట్టేలు) ప్రత్యక్ష మైనట్లు ఖురాన్ గ్రంథంలో పేర్కొని ఉంది. ఇందుకు స్మరిస్తూ ఏటా బక్రీద్ వేడుకలు పురస్కరించుకుని ఖుర్బానీ ఇవ్వడం తప్పని సరిగా మారింది. బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలు హజ్ యాత్ర సాగిస్తారు.

ఏర్పాట్లు పూర్తి..

బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశారు. కొన్ని ప్రాంతాల్లో సోమవారం ఉదయం 8.30 గంటలలోపే ప్రత్యేక నమాజ్ పూర్తవుతోంది.

ముస్తాబైన ఫోర్ట్ రోడ్డు ఈద్గా

సామూహిక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి


సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు (ఫైల్)

ఖిలా వరంగల్: ముస్లింల త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగను సోమవారం ఉదయం జరుపుకోనున్నారు. వరంగల్ జిల్లాలోని ఈద్గాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లను ఈద్గా ప్రతినిధులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఫోర్ట్ రోడ్డు ఈద్గా ప్రతినిధి ఎంఏ.జబ్బార్ మాట్లాడుతూ ఈద్గాలో సోమవారం ఉదయం 9గంటలకు ఈద్ ఉల్ జుహా ప్రత్యేక ప్రార్థనలు జరగనున్నాయని తెలిపారు. అధికారుల సహకారంతో ప్రార్థన స్థలాన్ని ముస్తాబు చేసినట్లు వివరించారు. ముఖ్యఅతిథులుగా మంత్రి కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు.

భారీ వాహనాలతో ఇబ్బంది పడుతున్నాం


దాస్యం వినయ్‌భాస్కర్‌కు తమ సమస్యలను విన్నవించిన కాలనీవాసులు

హన్మకొండ / కాజీపేట: భారీ వాహనాల రాకపోకలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాజీపేట ప్రాంతానికి చెందిన బృందావన్ కాలనీతో పాటు పక్క కాలనీవాసులు వాపోయారు. ఈమేరకు హనుమకొండ వడ్డేపల్లిలోని స్వగృహంలో మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌ను ఆదివారం కలిసి తమ సమస్యను వివరించారు. గతంలో పలు పరిశ్రమలకు చెందిన వాహనాల రాకపోకలు నిలిచిపోగా, గత కొద్ది రోజులుగా భారీ వాహనాల రాకపోకలు పునఃప్రారంభమయ్యాయని, దాంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు ఏకరువు పెట్టారు. గ్రానైట్ ఇండస్ట్రీకి సంబంధించిన లారీలు నిత్యం పెద్ద బండరాళ్లతో కాలనీల ద్వారా వెళ్తూ స్థానిక రహదారులను ధ్వంసం చేస్తున్నాయని, 24 గంటలు రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాల కారణంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాపోయారు. భారీ, అతి భారీ వాహనాలతో దుమ్మూధూళి తమ ఇళ్లపై చేరుతోందని, దాంతో పలు ఇళ్లు దెబ్బతింటున్నాయని చెప్పారు. అనంతరం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇదే సమస్యను పరిష్కరించినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు కూడా కాలనీవాసుల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు రవీందర్, రాజయ్య, సోని, భద్రయ్య, సరోజన, ఉమా, బుచ్చిరెడ్డి, వీరమల్లు విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీకి పార్థివదేహం అప్పగింత


శ్రీలక్ష్మి (ఫైల్)

హన్మకొండ కల్చరల్: హసన్‌పర్తికి చెందిన శ్రీలేఖ సాహితీ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ తిరుకోవళూరు శ్రీరంగస్వామి సతీమణి శ్రీలక్ష్మి గత శుక్రవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. ఈమేరకు వైద్య పరిశోధనల కోసం శ్రీరంగస్వామి తన సతీమణి పార్థివదేహాన్ని వరంగల్ కేఎంసీ అనాటమీ విభాగానికి ఆదివారం అప్పగించారు. కార్యక్రమంలో శ్రీరంగస్వామి కుమారుడు ఉషాకాంత్, కూతురు సంధ్య, శ్రీధరస్వామి, కవులు నిధి బ్రహ్మచారి, విజయ, విశ్రాంతాచార్యులు బన్న అయిలయ్య, వెంకటకృష్ణ, సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనులు షురూ!




ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. దాంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వరి సాగుకు నారు మడులను సిద్ధం చేసుకుంటున్నారు. సన్న రకానికి రూ.500లు బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అన్నదాతలు ఆ దిశగా దృష్టి సారించారు. పెద్ద సంఖ్యలో సన్నరకం వైపు మొగ్గు చూపుతున్నారు. బావులు, బోర్లు ఉన్న ప్రాంతాల్లో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. చెరువులు, కాల్వల కింద ఉన్న రైతులు వ్యవసాయ పనులను ఇంకా ప్రారంభించలేదు.

– హసన్‌పర్తి

దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

కాశిబుగ్గ: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) జాతీయ కోర్ కమిటీ కోచైర్మన్ అందె రాంబాబు, రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య డిమాండ్ చేశారు. ప్రతాప్‌నగర్‌లోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో వీహెచ్‌పీఎస్ వరంగల్, హనుమకొండ జిల్లాల సదస్సు ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము అధికారంలోకి రాగానే రూ.4 వేలు ఉన్న దివ్యాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచనున్నట్లు కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. పార్టీ అధికారంలోకి వచ్చి 6నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పెంచిన పింఛన్ ఇవ్వలేదని వాపోయారు. తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ నిర్వహించే అన్ని ఉద్యోగాల్లో దివ్యాంగులకు 4శాతం రిజర్వేషన్ కల్పించాలని సూచించారు. సమావేశంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ పోలెపాక శంకర్, కన్నూరు చంద్రశేఖర్, లక్ష్మణ్, శ్రీనివాస్, సామ్యేల్, స్వామి, అనిల్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న యోగా తరగతులు


యోగా చేస్తున్న సాధకులు

విద్యారణ్యపురి: సైక్లింగ్ యోగా వాకర్స్ ఆధ్వర్యంలో హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో కొంతకాలంగా ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. యోగా గురువులు జంగా గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్ సమక్షంలో ఉచిత యోగా శిక్షణ కొనసాగుతోంది. గత రెండు రోజులుగా యోగా పోటీలను నిర్వహించినట్లు జంగా గోపాల్‌రెడ్డి ఆదివారం తెలిపారు. విజేతలకు ఈనెల 21న ప్రపంచ యోగా దినోత్సవం రోజు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ యోగాతో మానసిక ఒత్తిడి దూరమవుతుందన్నారు. యోగాను జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యోగా సభ్యులు అనురాధ, అమరావతి, విజయరాణి, రాధిక, దివ్య, కల్యాణి, రోజా, రోహిణి, శ్వేత, రజనీ, గుప్త, సాయి, రాజు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత వరంగల్ వారియర్స్


వరంగల్ వారియర్స్ జట్టు సభ్యులు

హనుమకొండ చౌరస్తా: గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ క్రీడాపోటీల్లో వాలీబాల్ విజేతగా వరంగల్ వారియర్స్ జట్టు గెలుపొందింది. హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఆదివారం జరిగిన వాలీబాల్ ఫైనల్ పోటీల్లో యంగ్ ఎలక్ట్రానిక్స్ మీడియా జట్టుపై వరంగల్ వారియర్స్ జట్టు 25 – 6, 25 – 17 వరుస సెట్లలో విజయకేతనం ఎగురవేసింది. దీంతో జట్టు సభ్యులను ప్రెస్ క్లబ్ సభ్యులను అభినందించారు.

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ మీట్ –2024లో భాగంగా 4వ రోజు నిర్వహించిన వాలీబాల్, చెస్ పోటీలు ఆదివారం ముగిశాయి. చెస్ ఫైనల్ మ్యాచ్‌లో ఆడెపు మహేందర్ విజేతగా నిలవగా, వాలీబాల్ ఫైనల్ మ్యాచ్‌లో వరంగల్ వారియర్స్ జట్టు విజయం సాధించింది. ఆదివారం జరిగిన ఆటల ప్రారంభ కార్యక్రమంలో క్రీడాకారులను అతిథులు 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, బూర విద్యాసాగర్ గౌడ్‌కు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు పరిచయం చేశారు.

అవార్డు గ్రహీతకు వాకర్స్ సన్మానం


లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న బాధ్యులు

కేయూ క్యాంపస్: రక్తదాతల దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రజాసేవ అవార్డును హైదరాబాద్‌లో గవర్నర్ నుంచి కేయూ వాకర్స్ అసోసియేషన్ బాధ్యుడు దేశిని లక్ష్మీనారాయణ అందుకున్నారు. ఈమేరకు క్యాంపస్‌లోని దూరవిద్యా కేంద్రం ప్రాంగణంలో కేయూ ప్రగతి వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్లాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, బాధ్యులు మహేందర్ రావు, రతన్‌సింగ్, ప్రొఫెసర్ సంజీవరెడ్డి, ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి, ప్రొఫెసర్ వెంకయ్య, డాక్టర్ ఆశీర్వాదం, డాక్టర్ హరిప్రసాద్, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుమ్ము లేస్తోంది

- నిబంధనలకు విరుద్ధంగా ఫ్లైయాష్' రవాణా
- నిత్యం రోడ్డు ప్రమాదాలు


ప్రమాదానికి గురైన లారీ (ఫైల్)


ఫ్లైయాష్‌తో వెళ్తున్న లారీ

హసన్‌పర్తి: నిబంధనలకు విరుద్ధంగా ఫ్లైయాష్ (బూడిద)ను కొంతమంది రవాణా చేస్తున్నారు. ఆయా లారీల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని స్థానికంగా డిమాండ్ వ్యక్తమవుతోంది. రామగుండం థర్మల్ పవర్ స్టేషన్ నుంచి ఫ్లైయాష్‌ను ప్రధాన రహదారి మీదుగా ఖమ్మానికి చేరవేరుస్తున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా ఆ లారీలు నడుస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. లారీల్లో ఫ్లైయాష్ నింపినప్పుడు దానిపై కవర్లు ఏర్పాటు చేయకపోవడంతో రహదారిపై దుమ్ము పడుతోందని వాపోతున్నారు.

ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు

ప్రతిరోజూ రామగుండం నుంచి ఖమ్మం జిల్లా సత్తుపల్లికి వందలాది లారీల ద్వారా ఫ్లైయాష్ రవాణా అవుతోంది. బూడిదను తీసుకెళ్లే లారీలపైన సక్రమంగా కవర్లను కప్పకపోవడంతో గాలికి ఫ్లైయాష్ దుమ్ము రహదారిపై వెదజల్లుతోంది. ఫలితంగా లారీ వెనుకవైపు వస్తున్న వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

నిత్యం రోడ్డు ప్రమాదాలు

ఫ్లైయాష్ డస్ట్ వెదజల్లడం వల్ల జాతీయ రహదారిపై ప్రయాణం భారంగా మాతోందని పలువురు చెబుతున్నారు. దుమ్ము కారణంగా జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇసుక, ఇటికలు, ఉసుక తీసుకెళ్లే లారీలతో రహదారిపై ప్రమాదం పొంచి ఉంటోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

నిబంధనలకు విరుద్ధంగా ఫ్లైయాష్, ఇటుక, ఇసుక, ఉసుక లారీలు రోడ్డుపై నడుస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దుమ్ము కారణంగా ఇటీవల రెండు లారీలు ఢీకొన్నాయి. ఉసుక, ఇసుక, ఫ్లైయాష్‌ను తీసుకెళ్లే లారీల యాజమానులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు అప్పటి నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝాను కలిసి వినతిపత్రం అందజేయనున్నట్లు ఆయన చెప్పారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో సరస్వతి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు


ఖిలా వరంగల్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

ఖిలా వరంగల్: వరంగల్ హంటర్‌రోడ్డులోని తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో గిర్మాజీపేటకు చెందిన సరస్వతి ఉన్నత పాఠశాల 1984 –85వ బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. పూర్వ విద్యార్థులందరు ఒకచోట కలుసుకుని నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో బిల్లా రవి, మాచన ప్రేమ్‌సాగర్, వెల్దండి సుధాకర్, బోడకుంట్ల సంపత్, వరియోగుల శ్రీనివాస్, నాగుల జగన్, దాసరి రమేష్, సాంబశివుడు, ఎండీ.గౌస్, యాదగిరి, సుష్మ, వీణ, గీత, సుభాషిణి, పద్మ పాల్గొన్నారు.

ఖిలా వరంగల్ హైస్కూల్..

నగరంలోని ఓ హోటల్ కాన్వెన్షన్ హాల్‌లో ఖిలా వరంగల్ హైస్కూల్‌కు చెందిన 1978 – 79వ బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. అప్పటి మధుర స్మృతులను గుర్తుచేసుకున్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు బజ్జూరి బుచ్చయ్య, పోశాల శ్రీనివాస్‌గౌడ్, పోశాల సంపత్‌కుమార్, మట్టెవాడ సదానందం, పాలకుర్తి వెంకటేశ్వర్లు, మద్దెల రవీందర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బెల్లంకొండ రమేష్, బండి కోటేశ్వర్, పాలకుర్తి సత్యనారాయణ, గుర్రం రవీందర్, సుదర్శన్, పోశాల సంపత్, వేల్పుల రవీందర్, తాళ్లపెల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సోమిడిలో ఎల్లమ్మ తల్లి ఉత్సవాలు



కాజీపేట: కాజీపేట మండలం సోమిడి గ్రామ శివారులోని రేణుకాఎల్లమ్మ తల్లి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తగు ఏర్పాట్లు చేశారు. గౌడ కులస్తుల ఆధ్వర్యంలో మంగళవారం మహిళలు బోనాలతో డప్పు, వాయిద్యాలతో శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఆలయ అర్చకుడు శంకర్ శర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరగనున్నాయి. ఆలయ ఆవరణలో చల్లని పందిళ్లు, రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు.